




కొట్టు తలుపులు మూసి, తాళం పెట్టి—మళ్లీ దాన్ని ఒక్కసారి లాగి చూశాడు చలమయ్య. అది కఠినుడి హృదయంలాగా బిగించుకుని ఉంది .. పిదప, బీగాల గుత్తిని చొక్కా జేబులో పడేసుకుని తిరిగాడు. కొట్టులో పనిచేసే కుర్రాడు—రంగడు—పేవ్‌మెంటుమీద నిల్చున్నవాడల్లా చలమయ్యను సమీపించి "వెళ్లొస్తానండీ!" అన్నాడు వినయ శీలత.

"ఊఁ! ...." అని ఊఁకొట్టిన పిదప తన జేబునుండి చిల్లర డబ్బులు తీసి, అందులో ఓ పావలా బిళ్లను రంగడి కందిచ్చాడు చలమయ్య. ఆ పావలాను అందుకున్న కుర్రవాడు—చేతులు కట్టుకు నిల్చున్నాడు మౌనంగా.

"నే నిచ్చిన జీతం డబ్బులు జాగ్రత్తగా ఉంచుకున్నావుగదూ ?" అని ప్రశ్నించాడు చలమయ్య.

"ఓ!—లాగు జేబులో పొట్లం కట్టి,భద్రంగా దాచుకున్నానండీ!" అన్నాడు రంగడు.

"వెళ్లే దారిలో—కుర్రతనంగా—ఎక్కడైనా పోగొట్టుకోబోయేవు జాగ్రత్త! వెళ్లు!!" అని చెప్పి, చలమయ్య తిరిగి తన నివాసంవేపు నడక సాగించాడు.

ఆ వెళ్తున్న యజమాని కేసి రెండు నిమిషాల వరకూ కన్నార్పకుండా చూచి, పిదప చేతిలోని పావలాను ఒక్కసారి ముద్దుకుని, ఉత్సాహంగా నవ్వుకుని—తన యింటివేపు నడక ప్రారంభించాడు రంగడు.

కొట్టునుండి కొంతదూరం వెళ్లిన తర్వాత చలమయ్య వెనుదిరిగి, ఒక్కసారి తనకొట్టుకేసి చూపులు పోనిచ్చాడు. అతనికి అలా చూడటం రోజూ అలవాటయిపోయింది .... ఇప్పుడా కొట్టు వద్ద రంగడు లేడు!—కొట్టు ముందరఉన్న కార్పొరేషన్ దీపం ఏకాంతంగా నిల్చుని వెలుగుతున్నట్టు అనిపించింది.

పట్టుమని పన్నెండేళ్లు నిండని రంగడు, తన దగ్గర ఎంత నమ్మకంగా, వినయ విధేయతలతో పనిచేస్తున్నాడూ? వాడి కంటే మరో మంచి కుర్రాడు—అదీ అంత తక్కువ జీతానికి—తనకు లభించడు! ఏదో, వాడి దురదృష్టంకొద్దీ నౌకరీ చేస్తున్నాడు కానీ, కష్టం తెలుగని విద్యార్థి జీవితం గడపవలసిన వయస్సులోనివాడు గదా! లేమితనం కారణంగా లేత వయస్సులో నౌకరీ చేయగలుగుతున్నాడు! పాపం! పేదవాడు! తను వాడి కిస్తున్న నలభయి రూపాయిలూ, నేటి రోజులున్న స్థితిలో చాలవేమో! తల్లిదండ్రులు లేని, ఒక్కగానొక్క అక్కగారితో, అదీ పెళ్లి కెదిగిన వడుచుతో—జీవితం గడుపుతున్నాడు! పాపం! తమ్ముడి సంపాదనతో కాలం వెళ్లబోస్తున్న వాళ్ల అక్కయ్యకు, ఈ కాలంలో పెళ్లి జరుగగలదనే నమ్మకం ఏమాత్రం ఉంటుందీ? అయినా, వాళ్లకు తను మాత్రం ఏం సహాయం చేయగలడు? పోనీ, వచ్చే మాసంనుండీ రంగడికి మరో అయిదు రూపాయలు జీతంలో కలిపి యివ్వాలి! వాడి కిచ్చినంతలో తనకు వచ్చే లాభమేం తరిగిపోదుగదూ?!—

"చలమయ్యా!" అనే పిలుపు విని వూహా ప్రపంచంనుండి తేప్పరిల్లుకుని తిరిగి చూశాడు చలమయ్య. తనింటికి పక్కింట్లో ఉంటున్న భద్రయ్య, తనను వెన్నంటి వస్తున్నాడు .... ఆయన వెంబడి—ఆయన శ్రీమతి, ఇద్దరు మగ పిల్లలూ వస్తున్నారు.

"ఇంతవేళలో ఎక్కడికి వెళ్లి తిరిగి వస్తున్నట్టు? .... సినిమా కేమేనా వెళ్లారా, భద్రయ్యా" అని ప్రశ్నించాడు చలమయ్య.

"సినిమాకు కాదు లేవయ్యా, ఎగ్జిబిషన్ వెళ్లొస్తున్నాం .... పిల్లలు చూడాలని పీక్కుతింటూంటే, అలా తీసుకు వెళ్లాను .... దానికి ప్రతిఫలం—అంటే నష్టం—పది రూపాయలు ...." అని చిరునవ్వు నవ్వాడు భద్రయ్య.

"నీ ఒక్కడికే అంత ఖర్చు కాలేదు గదా! .... మీ కుటుంబం, పిల్లల ఆనందం కోసం ఖర్చు పెట్టారు .... అదేం దండుగ కాదు!"

"వాస్తవమేలే! .... కాని, ఆ పది రూపాయలతో అయిదు రోజులు వస్తులు లేకుండా గడుపవచ్చునని ...."

".... అలా అయితే—లోకంలో వినోద, విహారాల గురించిన అవసరమే లేదు కదయ్యా! భద్రయ్యా! నీ కెప్పుడూ డబ్బుమీద కన్నే గాని—కుటుంబం, జీవితం గురించిన మాటే లేవదు!"

"అహ్హా!—గంపెడు సంసారాన్ని నెత్తిన పెట్టుకున్నట్టు మరీ చెప్పొచ్చావు లేవోయ్!—బాగు! నువ్వొక కుటుంబీకుడ వయితే, అలా చెప్పేవాడివేనా!?" అని సూటిగా, అవహేళనగా, చిలిపిగా ప్రశ్నించడంతో—భద్రయ్య మాటలను ఎదుర్కొనలేక మౌనం వహించాడు చలమయ్య.

ఇళ్లు సమీపించాయి .... భద్రయ్య కుటుంబం

65-వ పేజీ చూడండి

# చలమయ్య్యా పెళ్లి

11—వ పేజీ తరువాయి

వాళ్లింట్లోకి వెళ్లిపోయింది  చలమయ్య నివసి స్తున్నది యింటి వీథి భాగంలోని ముందు గది కాబట్టి, ఆ యింట్లో వాళ్లెవర్నీ శ్రమ పెట్ట వలసిన అవసరం లేకపోయింది

గది తలుపు తెరచి, తెచ్చిన డబ్బును పెట్టెలో దాచిన తర్వాత, గదిలోని నులక మంచాన్ని బయటికి తెచ్చి వేసుకుని శరీరం వాల్చాడు చలమయ్య. అతని ఆలోచనలు భద్రయ్య మాటలను ఒక్కసారి జ్ఞప్తికి తెప్పించాయి. 'గంపెడు సంసారాన్ని నెత్తిన పెట్టుకున్నట్టు, మరీ చెప్పొచ్చావు లేవోయ్ ! నువ్వూ ఒక కుటుంబీకుడ వయితే అలా చెప్పేవాడివేనా ?—'

అనుభవస్థుల యెదుట వివేకంతో వాదించడం కూడా ప్రమాదమే గాబోలు !

భద్రయ్య ఎన్నోసార్లు తనను హెచ్చరించాడు. 'చలమయ్యా ! జీవిత పరిధిలో—ఎన్నో కోణాలు—వేర్వేరు విధాలుగా ఉంటాయి ఆ కోణాలను చేజిక్కించుకుని, మంచీ చెడులః మాటలను అవతల నెట్టి—లోకం ఎన్నో విధాలుగా నిందిస్తుంది ఒక్కొక్కప్పుడు భట్రాజులా పొగడుతుంది కూడా ! అందువల్ల జీవితం సొంతం నిర్మలంగా సాగుతున్న సహజం ఏమాత్రం కనిపించదు. నేనూ—నా చిన్నతనంలో పెళ్లి వాంఛను మనస్సులోకి తెచ్చుకోకుండానే ఉండిపోయాను . కాని, తెలియరాని వాంఛ, అసహజమైన అనుభూతులు నన్ను వేర్వేరు కోణాలలోకి ఈడ్చుకుపోయాయి అలాంటప్పుడల్లా ఆలోచించేవాణ్ణి !—బాగా ఆలోచించేవాణ్ణి ! ఆఖరికి పట్టు దొరికింది. ఆడా, మొగా లోకాన్ని ఎదిరించి—ఏకాకిగా నిలబడడం దుర్భరమనీ, అసహజమనీ గ్రహించాను అందుకే ఆఖరికి పెళ్లి చేసుకున్నాను .అప్పటికి నాలోని అనుభూతులకు 'మేత' లభించింది నాలో సంతృప్తి ఏర్పడింది . ఆ కొన్నాళ్లపాటి జీవిత పరిధులు నన్ను మానవుణ్ణి చేశాయి .ఆ జీవిత పరిధులు ఏమిటో తెలుసా ?—నా స్వరూపాలు ! అంటే, నా పిల్లలు ! నా పిల్లల్ని చూస్తున్నప్పుడల్లా—నాలో నేను—మానవత్వం నిలబెట్టుకున్నా నన్న గర్వంతో ఉప్పొంగిపోతున్నాను ."

అయితే, చాలినంత సంపాదన లేక, కుటుంబంలో చిన్న కలతలు రేగుతున్నప్పుడల్లా భద్రయ్య బాధలను తను కళ్లారా చూస్తూనే ఉన్నాడు కాని, ఆ బాధలన్నీ క్షణికాలనీ భద్రయ్యచేత విన్నప్పుడు, కొన్ని గంటల తర్వాత వాళ్ల కుటుంబంలోని చేతలు చూసినప్పుడు—ఆ జీవితం అంతేనేమో అని సంతృప్తి పడి, ఒప్పుకోలుతో నిట్టూర్చేవాడు తను

అర్ధాంగి లేని జీవికి, జీవితం రుచించదన్న సిద్ధాంతం వాస్తవమే గాబోలు ! బ్రహ్మచారి ముదిరినా, బెండకాయ ముదిరినా ప్రమాద మనే వాక్కు నిజమేనేమో !

అలా అయితే, తను కుటుంబ జీవితం గడపాలి .. ఆ అనుభూతులలో—ఏవేవో వాంఛలు తీరుతున్నట్టు, స్వప్నావస్థగా జరిగిపోయింది. కొంతసేపు.

ఎక్కడో గణగణ గంట మ్రోగుతున్నట్టు చప్పుడయింది అనుభూతుల్ని విదిలించుకొని, వాస్తవికలోకంలోకి ప్రవేశించాడు చలమయ్య

"అన్నయ్యా ! ." అంటూ ఓ స్త్రీ కంఠం అతన్ని పిలిచింది. చలమయ్య కళ్లు విప్పి, మంచం మీద లేచి కూర్చుని—వీథిలోకి చూశాడు మసక వెలుగులో కనిపించిన ఆ స్త్రీమూర్తిని గుర్తించి ఆశ్చర్యపోయాడు "సుశీలా ! ...." అంటూ అతని అధరాలమధ్య అక్షరాల సంబోధన వెలువడింది.

అప్పుడప్పుడే సైకిలు రిక్షా నుండి దిగిన ఆమె చలమయ్యను సమీపించింది

"ఏమిటమ్మా యిది ? ఇంత రాత్రివేళ ఒంటరిగా ఎందు కొచ్చావు ?" అని ఆతురతగా, అర్ధావేశంతో ప్రశ్నించాడు చలమయ్య

"ఆపదలకు ఒంటరితనము, రాత్రివేళలూ అడ్డొస్తాయా అన్నయ్యా ?" అంది సుశీల—అతని చెల్లెలు ఆవేదనతో.

రిక్షావాడు సవారీ డబ్బుల్ని గురించి హెచ్చరించాడు కొంగున ముడి వేసుకున్న చిల్లర డబ్బుల్ని రిక్షావాడి కిచ్చిందామె రిక్షావాడు వెళ్లిపోయాడు. అంతలో దీపం వెలిగించి వచ్చాడు చలమయ్య

"కూర్చో, సుశీలా ! .... "

"అన్నయ్యా ! . . ఎదురుచూడనివన్నీ జరిగిపోయాయి నా చెడ్డకాలం కాకపోతే, ఈ ఆపదలన్నీ మమ్మల్నెందుకు చుట్టుకుంటాయి? భగవంతుడు కూడా చిన్నచూపు చూస్తున్నాడు"

"జరిగిందేదో వివరంగా చెప్పు, సుశీ ?"

"ఏం చెప్పను ? . ." అంటూ ఆవేదనతో కుమిలిపోయి, నెమ్మదిగా యిలా అంది : "ఆయన పనిచేస్తున్న కంపెనీలో, మేనేజరు కొంత డబ్బు యిచ్చి ఆయన్ని వెళ్లి బ్యాంక్‌లో కట్టి రమ్మన్నారట డబ్బు తీసుకొని వెళుతూండగా ఎవరో జేబుదొంగ ఆ డబ్బుల్ని కొట్టేశాడు గాబోలు తీరా, ఆయన బ్యాంకి దగ్గరికి వెళ్లి చూసుకుంటే డబ్బు లేదట. జరిగిందంతా ఆ మేనేజరు వద్ద చెప్పుకున్నా, మేనేజరు ఆయన మాటల్ని లెక్కచేయక రేపు మధ్యాహ్నానికల్లా ఆ డబ్బు తనకు తెచ్చిపెట్టకపోతే పోలీసుకు రిపోర్టు చేసి, ఆయన్ని జైల్లో పడేస్తానని చెప్పాడట ! మరి, ఆ డబ్బు తెచ్చిపెట్టడం ఎలా యిప్పుడు ? ఆ విషయమై ఏమీ తోచక ఆయన నిర్జీవిలా ఉన్నా రన్నయ్యా! ఆయన ఉన్న స్థితిని చూస్తే—నా జీవితానికి ఏం ప్రమాద మేర్పడుతుందో నని కంగారుగా ఉంది దీనికి నువ్వేదైనా దారి చూపించి, నా మాంగల్యాన్ని నిలబెట్టు అన్నయ్యా ! ఈ ఆపద సమయంలో నువ్వు తప్ప నా కింకెవ రున్నారూ ? ...." అని విలపించింది.

చెల్లెలు దుఃఖాన్ని చూడలేక కళ్లు తుడుచుకున్నాడు చలమయ్య "మరేం ఫరవాలేదు లేమ్మా! విచారించకు ! ... ఆఁ . పోగొట్టుకున్న డబ్బు ఎంతమాత్రం ఉంటుంది ? .... " అని ప్రశ్నించాడు

"వెయ్యిన్ని రెండు వందలట ! .... "

"ఆఁ ! .. అంత పెద్ద మొత్తమే !"


పండిత
డి. గోపాలాచార్యులవారి
జీవామృతం
ఆరోగ్యానికి బలానికి
ఆయుర్వేదాశ్రమం
(ప్రైవేట్) లిమిటెడ్
మదరాను-17

డాక్టర్ వృత్తి చేయండి !
ఇంటిలో విరామంగా కూర్చొని వుండేప్పుడు. పోస్టల్ ట్యూషన్ ద్వారా, హోమియోపతి చదువుకొని, గవర్నమెంటు రిజిష్టర్డు కాలేజి ద్వారా డిప్లొమా పొందండి. ప్రాస్పెక్టస్ ఉచితము.
వివరములకు వెంటనే వ్రాయండి
INDIAN
HOMOEOPATHIC
COLLEGE
(APW) Jullundhar City

యాలక్కాయ, లవంగము
తాంబూలములకు
యిప్పుడు అక్కరలేదు.
రుచి
RUCHI
సుగంధ ద్రవ్య సముదాయము
అన్ని కిరాణాకొట్లలో దొరకును.
కాఫీకొట్లలో వాడబడుచున్నది.
నానాకాస్మటిక్సు, విజయవాడ-2.

నెర్విటాల్
నరముల బలహీనతకునూ, రక్తపోటుకున్నూ రామ బాణము. అనుభవయుక్తముగా చేయబడినది.
8 ఔ. సీసా 5–75, పోస్టేజి 1–75
ఇండియన్ మెడిసన్ హౌస్,
విజయవాడ-2.

తెలుగు పత్రికలన్నిటిలో 'ఆంధ్ర సచిత్ర వారపత్రిక' సర్క్యులేషన్ అధికమైనది

సామాన్య ధరలలో అతి శ్రేష్ఠమైన తువ్వాళ్లు

తువ్వాళ్లు • చేతిరుమాలలు • బాత్‌మేట్స్

• బొంబె-డైయింగ్ సాంప్రదాయకంగా శ్రేష్ఠమైనవి • ఏళ్ల తరబడిగా వాడకము నిమిత్తం నేయబడినవి • తెలుపులోను ఎన్నికైన అనేక వివిధ ఆకర్షణీయ రంగులలోను మరియు నాజూకైన నమూనాలలోను గలవు.

బొంబె - డైయింగ్



CBD-61/TE

# చలమయ్యా పెళ్లి

"ఆయన విషయం నీకు తెలిసిందేగదా, అన్నయ్యా!.. అంత పెద్ద మొత్తాన్ని ఆయన మాత్రం ఎలా తెచ్చిపెట్టగలడు ?"

"నిజమే, సుశీ! .... నారాయణ విషయం నాకు తెలుసు .... ఇందులో అతని 'విషమం' అంటూ ఏదీ ఉండదన్న నమ్మకం కూడా నాకు పూర్తిగా ఉంది. కాని, అంత పెద్ద మొత్తాన్ని నేను మాత్రం ఎలా తెచ్చి యివ్వగలను ?"

"అలా చెప్పకు అన్నయ్యా!.. మనస్సుంటే, తప్పక మార్గం కనిపిస్తుంది నీకు! రేపు మధ్యాహ్నానికి ఆ డబ్బు చెల్లించకపోతే ... ఆయన .. ఆయన .... ఏవిధంగానైనా .... ఆత్మహత్య . . చేసుకుంటారేమోనని ...."

"ఛీ, ఛీ!!—ఏం పాడు మాటలవి—పిరికి వాళ్ళు అనవలసినవి! .... సరే! .... ఇంటికి వెళ్దాం రా, సుశీ! ...."

"మరి ... మరి .. డబ్బు విషయం ? ...."

"నీకు సహాయం చేయలేని ఈ శరీరం బ్రతికి ఉంటుందనుకున్నావా! నా ప్రాణాలను పణయం పెట్టి అయినా, నీ మాంగల్యానికి వచ్చిన ఆపదను అడ్డగిస్తాను. వెళ్దాం రా!"

తోబుట్టువు కళ్లలో నీళ్ళు తిరిగాయి ....

"పిల్లాడ్ని తీసుకురాలేదా ?" అని ప్రశ్నించాడు చలమయ్య నిద్రిస్తున్న తన రెండేళ్ల కొడుకును, మరో వాటాలో ఉన్న అమ్మలక్కలను చూసుకోమ్మని చెప్పి వచ్చానని చెప్పింది సుశీల

తన గదికి తాళం పెట్టిన తర్వాత, చెల్లెల్ని తీసుకుని హైరోడ్డుకు వచ్చాడు చలమయ్య. సుశీలను సవారీలో తీసుకొచ్చిన అదే రిక్షావాడు టీ కొట్టు దగ్గర కూర్చుని బీడీ కాలుస్తున్నాడు కాబట్టి, ప్రయాణం చేయడానికి వాళ్లకే అగచాట్లూ లేకపోయాయి

చిన్నతనంలోనే తండ్రిని పోగొట్టుకున్న దురదృష్టహీనులు చలమయ్య, సుశీలలు. అప్పటికి చలమయ్యకు పదమూడేళ్ళు సుశీలకు అయిదు సంవత్సరాలు చేనేత పరిశ్రమ వాళ్ల కుటుంబ కులవృత్తి గాబట్టి, అంత చిన్నతనంలోనే చలమయ్య తన తండ్రి స్థానంలోకి జొరబడ్డాడు వాళ్ల తల్లి అతనికి చేదోడుగా శ్రమించసాగింది. అయితే—విధి విచిత్రమైందన్న సత్యం వాళ్ల విషయంలో ఋజువైంది. కొన్నాళ్ల తర్వాత—ఒకనాడు, 'కలరా' సోకడంవల్ల—వాళ్ల తల్లి గూడా హఠాత్తుగా వాళ్లకు దూరమయిపోయింది ఏకాకిగా—తన చెల్లెల్ని పువ్వులాగా రక్షించాలనే ఏకైక లక్ష్యంతో చలమయ్య కొంతకాలంపాటు కష్ట పరంపరలను ఈదుతూ, తన జీవిత వృత్తినే అవలంభించాడు. అయితే చేనేత పరిశ్రమ క్షీణించే స్థితి కలగటం వల్ల, అతనికా వృత్తిలో ఏవగింపు కలిగింది. అతని ఆశయాలు సగానికి సగమయినా నెరవేరలేక పోయాయి. అంతటి కష్టదశలోనూ—ఒక వంద రూపాయలు చేర్చిపెట్టి, దాన్ని ఆధారం చేసుకుని, జీవితంలో పురోభివృద్ధి చెందాలని ఆశించి, డబ్బునూ, చెల్లెల్నీ తీసుకుని, పల్లె వదిలి పట్నం

వచ్చేశాడు. కొందరి సత్పురుషుల సలహాలమీద మొదట చిన్న కిళ్లీకొట్టు పెట్టాడు చలమయ్య. సంవత్సరాలు గడిచాయి అతను పాతిన పూల మొక్కలు పుష్పించినాయి. విర గాచినాయి నిజమే. కిళ్లీకొట్టు క్రమేణా జనరల్ స్టోర్సుగా రూపొందింది. అతని దగ్గర నాలుగు డబ్బులు కూడా నిలిచాయి. అప్పటికి సుశీల ఈడు కూడా పెరిగింది పెళ్లి కెదిగి, విరబూచిన పువ్వయింది. చలమయ్య తన కర్తవ్యాన్ని మరచిపోలేదు తన చెల్లెలకు తగిన వరుడ్నిగా నారాయణను ఏరుకుని, నిశ్చయంచేశాడు. అదేదో పెద్దకంపెనీలో నూటయాభై రూపాయల ఉద్యోగం చేస్తూ ఏకాకిగా జీవితం గడుపుతున్న అతనికి, తన చెల్లెల్ని పెళ్లిచేసి, వాళ్లను కుటుంబీకుల్ని చేశాడు తను సాంప్రదాయ ప్రకారం, తన తోడునీడై పెరిగిన తన చెల్లెల్ని, భర్తతో సాగనంపి విచారాశ్రువులు నిండిన ఆశీర్వచనాలతో—ఆనందంగా నిట్టూర్చాడు చలమయ్య చెల్లెలికి కొడుకుపుట్టి రెండు సంవత్సరాలు గూడా గడిచింది. అయితే—ఇప్పటికి ఆమె జీవితంలో ఇంతటి అపశ్రుతులా ! ....

నిశ్చివిలా పడుకుని, వేదన అనుభవిస్తున్న చెల్లెలి భర్తను చూసి, విచారవదనంతో నిట్టూర్చాడు చలమయ్య.

"బావా ! .... ఈ స్వల్ప విషయానికి ఇంతగా కుమిలిపోవడం బాగుండదు ! ధైర్యంగా ఉండండి! జరగవలసిందేదో, నేను చూస్తాను" అని హామీ యిచ్చాడు చలమయ్య

అప్పుడే నిద్ర మేల్కొన్న రెండేళ్ల కుర్రాణ్ణి తీసుకొచ్చి, తన అన్నగారి చేతి కిచ్చింది, సుశీల ... ఆ పసిపాపడ్ని భుజాన వేసుకుని వీధి అరుగుమీద కూర్చున్నాడు చలమయ్య భుజాన వేసుకున్న ఆ పిల్లాడు కొంతసేపటికల్లా నిద్రించాడు, ఏ విచారాన్నీ మనస్సులోకి తెచ్చుకోకుండా! కాని చలమయ్య మాత్రం—ఏదో ఆలోచిస్తూనే— రాత్రి చాలాసేపటి వరకూ నిద్ర కుపక్రమించలేకపోయాడు.

*   *   *

మరునటిరోజు ఉదయం—మామూలుగా నౌకరీలో ప్రవేశించడానికి వచ్చిన రంగడికి, నా డెన్నడూ ఎదురుచూడని విచిత్ర సంఘటన ఎదురయింది.

చలమయ్య కొట్టులో మరో 'చెట్టియారు' కూర్చొని ఉన్నాడు కొట్టులోని సరుకును వివరిస్తూ—ఆయనకు లెక్క గడుతున్నాడు తన యజమాని

ఆ దృశ్యం రంగడి హృదయంలో పెద్ద గొడ్డలి పెట్టుగా నాటుకుంది పేవ్‌మెంటు మీద నిలుచున్నట్లే—చూస్తూండిపోయాడు, అర్ధగంట వరకూ

వివరాలు పూర్తి అయ్యాక, చలమయ్య కొట్టు దిగివచ్చాడు విచారవదనంతో ఉన్న రంగడికి—విచారపు నిట్టూర్పుతో సమాధాన మిచ్చాడు యజమాని

"రంగా ! అలా ఉన్నావేం ?"

"ఏమిటి బాబూ, యిదంతా ! మీ కొట్టులో కూర్చున్న ఆ కొత్త మనిషి ..."

"  ఇకనుంచీ, ఈ కొట్టుకు యజమాని !"

"అంటే ? ...."

"డబ్బు అవసరంకొద్దీ, కొట్టును అమ్మేయవలసిన అగత్యం ఏర్పడిందోయ్ ..."

"బాబూ ! ...."

" .... నీ నౌకరీ వూడిపోయిందని విచారిస్తున్నావు గదూ ! .... ఏం చేయగలను ! .... ఈ కొట్టులో నిన్నే ఉంచుకోమని చెట్టియారుకు ఎన్నోవిధాలా చెప్పిచూశాను కాని, ఆయన దగ్గర ఇంతక్రితంనుంచి మరో వ్యక్తి ఉండడంవల్ల —ఈ కొట్టులో—నిన్ను ఉంచుకోవలసిన అవసరం లేదని చెప్పేశాడు."

చలమయ్యమాటలు విని—ముఖం దించుకున్నాడు రంగడు. వాడి నేత్రాలనుండి నీటిబొట్లు—నేలమీద రాలాయి—రక్తబిందువుల్లాగా.

"వెయ్యిన్ని రెండువందల రూపాయలలో—నా చెల్లెలి జీవితం బాగుపడగల సమయం రావడం వల్ల—నే నీ కొట్టును అమ్మేయగల స్థితి ఏర్పడింది ఇలా చేయడం కంటే, మరో మార్గం తోచలేదు, రంగడూ !—

రంగడు తనయజమాని ముఖంలోకి చూశాడు.

## వచ్చేవారం

# స్వయంవరం

## దేవిక

వాడికి విచారం పెల్లుబికింది. రెండు చేతులా ముఖం కప్పుకుని ఏడ్చేశాడు.

రంగడి భుజాన్ని ఆప్యాయంగా తట్టి, బుజ్జగించవేశాడు చలమయ్య. పిదప రెండువందల రూపాయల నోట్లు జేబునుండి తీసి వాడికిస్తూ "రంగడూ !—నావద్ద నువ్వు నమ్మకంగా మూడేళ్ల పాటు పనిచేసినందుకు, ఆత్మీయతతో నడుచుకున్నందుకు—ప్రతిఫలంగా దీన్ని ఉంచుకో! అదృష్టం కొద్దీ—నేను మళ్లీ వృద్ధికి రాగల సూచనలు కనిపిస్తే, నిన్ను నేను తప్పక ఆదుకుంటాను వెళ్లు" అన్నాడు

టవర్ గడియారం పదిగంటలు కొట్టి, చలమయ్యకు మరో అవసర కర్తవ్యాన్ని గుర్తుచేసింది

అతను ప్రయాణమై, తన చెల్లెలి యింటికి వచ్చి—పన్నెండు వందల రూపాయలను నారాయణ చేతికిచ్చి, నిర్లక్ష్యంగా నవ్వి వూరుకున్నాడు ఆ నిర్లక్ష్యంలో తను చెల్లెలి సౌభాగ్యంకోసం చిన్న త్యాగం చేస్తున్నట్లు మనశ్శాంతి కలిగింది

ఆపద సాగరంలో చెలరేగిన అవమానపు తుఫాను వల్ల మునిగిపోబోతున్న తన జీవిత నౌకను రక్షించిన తన అన్నగారి పాదాలకు నమస్కరించింది సుశీల.

"నా గౌరవాన్ని, ఉద్యోగాన్ని కూడా నిలబెట్టారు, బావగారూ!— మీ ఋణం త్వరగా తీర్చుకుంటాను" అన్నాడు నారాయణ కృతజ్ఞతతో.

"నీ పిచ్చిగాని, ఋణం తీర్చుకోవలసిన బాధ్యత వాది మాత్రమే, నారాయణా !—నాకు, నా చెల్లెలి సుఖంకంటే, కావలసిం దేముంది, చెప్పు !—" అన్నాడు చలమయ్య—అనుబంధ పాశాలను హృదయంలో కుదించుకుంటూ

నారాయణతోపాటు చలమయ్య కూడా వెళ్లి, కంపెనీలో డబ్బు కట్టి వచ్చారు.

అయితే—కంపెనీకి చెల్లించిన అంత డబ్బు, ఎలా సంపాదించానన్న విషయాన్ని, ఎవరికీ చెప్పడానికి నిరాకరించాడు చలమయ్య.

*   *   *

ఒక వారం రోజుల తర్వాత—

ఒకానొక రాత్రి తొమ్మిది గంటలకు తన గదికి వచ్చాడు చలమయ్య. తన జీవిత గమనంలో అసంతృప్తి, సుఖంలేని బ్రతుకు బ్రతుకుతున్నట్లు నిరుత్సాహం—అతన్ని పీడించింది. ఏకాకి నివాసానికీ, హోటలు తిండికీ అలవాటుపడ్డ అతని శరీరం నిరుపయోగమైన ముక్కగా తయారవుతున్నట్లు కన్పించింది. ఇప్పుడు తను నివాసం చేరగానే తన బాధలను శమనింప చేయగల తోడు నీడ, చిరునవ్వుతో పలకరించగల దిక్కూ—ఇవన్నీ తన జీవితానికి అవసరమన్న ఆశయం అతన్ని వేధించింది.

ఏ అడ్డంకులూ లేక—మనిషిని లోబరచుకోగల శక్తి ఒక్కటే ఉంటున్నదీ లోకంలో !—అది : నిద్ర

ఆలోచనా వేధనలతో అలసి సొలసి, ఆఖరికి నిద్ర కుపక్రమించబోయి కనులు మూశాడు చలమయ్య. అంతలో—

"చలమయ్యా !—" అని పిలుస్తూ భద్రయ్య అతన్ని సమీపించాడు.

"రా, భద్రయ్యా !—కూర్చో !—" అన్నాడు చలమయ్య

"ఇప్పుడే వచ్చి—వచ్చీ రాగానే, పడక వేశావన్నమాట ! .. అంతేలే ! ఏకాకివి .. . జీవితం ఎట్లా ఉన్నా, నీకు సరిపోతుందిలే !"

"నీమాట నిదిగాని—భద్రయ్యా !—నాకు ఒక్క సందేహం ! కోరికలు లేని మానవు డంటూ—ఎవడైనా, ఈ ప్రపంచంలో ఉంటాడంటావా ?"

"ఉంటాడు ..."

"ఆశ్చర్యమే !—మరి ఎవరు, ఎక్కడుంటాడంటావ్ ?"

"సన్యాసి !—ఇక్కడుండడులే !—ఏ కారడవుల్లోనో, పర్వతశిఖరాల్లోనో తపస్సు చేస్తూ ఉంటాడు!"

"సన్యాసికీ—మోక్షం సిద్ధించాలన్న కోరిక ఉంటుంది కదా !—"

"నిజమే కాని, అది మరో లోకపు మాట గదా !—"

"మంచి వేదాంతమే .." నవ్వాడు చలమయ్య.

భద్రయ్య కూడా కొంతసేపు మనసు విప్పి నవ్వుకున్నాడు పిదప—"ఆఁ ! చెప్పడం మరచాను చలమయ్యా !—మీ చెల్లెలి భర్త—నారాయణ—



పిల్లల లివర్ అండ్ స్ప్లీన్ (బల్ల) వ్యాధులకు

టెక్కలి డాక్టరు గారు

ఈ క్రింది స్థలములలో



ఉ 9 గం॥ నుండి 12 గం॥ వరకు సలహాయిచ్చెదరు

24-12-61 ... సత్యనారాయణ ఫార్మసీ, విజయనగరము.

27-12-61 ... లక్ష్మీనారాయణ కంపెనీ, కాకినాడ.

29-12-61 ... సాంతి నివాస్, విశ్రాంతి భవనము, రాజమండ్రి.

1- 1-62 ... కొమ్మూరి వీరభద్రయ్య అండ్ సన్సు, నిడదవోలు

2- 1-62 ... బంగారు వెంకటచలం అండ్ సన్సు, భీమవరం.

3- 1-62 ... క్రిష్ణా అండ్ కో., ఏలూరు.

7- 1-62 ... ప్రభాత్ మెడికల్ స్టోర్సు, గుడివాడ.

8- 1-62 ... నాదళ్ల వారి మచిలీపట్నం మెడికల్ స్టోర్సు, బందరు

10- 1-62 ... శ్రీ ఉమా డ్రగ్ స్టోర్సు, సామారంగం చౌక్ వద్ద, విజయవాడ.

11- 1-62 ... పద్మనాభ మెడికల్ స్టోర్సు, గుంటూరు.

ది ఒరిజినల్ లివర్ రెమిడీ హోమ్ (రిజిష్టర్డు నెం. 139)

విశాఖపట్నం-1



## రవీంద్ర సాహిత్యం

| | | | |
|---|---|---|---|
| గోరా | 8-00 | నటీర్ పూజ | 1-50 |
| ఘోఖేర్ బాలి | 6-00 | ఉత్తమ యిల్లాలు | 1-50 |
| త్యాగఫలం | 6-00 | కిరణ్మయి | 1-50 |
| ఆదర్శ ప్రేమ | 5-00 | పసిపాపల దరహాసం | 1-50 |
| రవీంద్ర నాటకావళి (ఆరు నాటకాలు) | 5-00 | నా జన్మభూమి | 2-00 |
| | | లేబరేటరీ | 1-50 |
| పడవ మునక | 5-00 | రవికిరణాలు | 1-00 |
| ఇంటా - బయట | 4-50 | పోస్టాఫీసు | 1-00 |
| జీవిత స్మృతులు | 3-75 | ప్రేమకానుక | 1-00 |
| గీతాంజలి | 3-00 | రవీంద్ర దర్శనం | 1-50 |
| సాధన | 2-50 | ఆకలిరాళ్ళు | 0-50 |
| అరూపరత్నం | 1-75 | నదీతీరం | 0-50 |
| నందిని | 1-50 | చంద్రవంక | 0-50 |
| ముక్తధార | 1-50 | కాబూలీవాలా | 0-50 |

ఈ మొత్తం పుస్తకాలు సెట్టు ఒకేసారి కొన్నవారికి రు 55.00 లకే ఇవ్వగలము.

జయంతి పబ్లికేషన్స్

గోపాలరెడ్డి రోడ్డు : : విజయవాడ-2. (A P)


# చలమయ్య పెళ్లి

ఇంతవరకూ నీకోసం ఎదురుచూస్తూ కూర్చుండి ఇప్పుడిప్పుడే వెళ్లాడు" అన్నాడు.

"అలాగా! నేను రావడం ఇవాళ కొంత ఆలస్య మయింది గాని, అతనేమైనా చెప్పాడా ?"

"ఆఁ!—తన పిల్లాడికి, రేపటికి పుట్టినరోజు పండగట! ఏవో పనులకొద్దీ, నిన్ను పిలవటానికి మీ చెల్లెలు రాలేకపోయిందట ఆ శుభకార్యాన్ని నువ్వు దగ్గరుండి జరిపించవలసిందిగా చెప్పమని, నిన్ను తప్పకుండా రమ్మని మరీ మరీ చెప్పి, వెళ్లాడు!"

"సంతోషం!—" అని నిట్టూర్పు విడిచాడు చలమయ్య .. అయితే తను వెళ్లడమనేది సాధ్యమా అన్న సందేహం అతన్ని వేధించింది ఆ బాధను భద్రయ్య ఎదుట కనబర్చుకోలేకపోయాడు కూడా!

ఆతర్వాత ఆ మిత్రు లిద్దరూ లోకాలోకనం గురించి చర్చించుకుంటున్న సమయంలో—

"బాబూ! ...." అనే పిలుపు విని, వాళ్లిద్దరూ వీధిలోకి తిరిగి చూశారు కుర్రాడు రంగడు వీధిలో నిల్చున్నాడు. అతని వెంబడి మరో మగువ, చీరచెరగు భుజానికి చుట్టుకుని నిలబడి ఉంది

"రంగడూ! ..." అని ఆశ్చర్యంగా ప్రశ్నించాడు చలమయ్య

"నేనే బాబూ! "

"అక్కడే నిలబడ్డావేం ?—ఇలారా" అని చలమయ్య సమాధాన మిచ్చిన తర్వాత, రంగడు వాళ్లను సమీపించాడు. "ఇలా వచ్చావేం ? ఎక్కడైనా పనిలో ఉంటున్నావా, లేదా ?" అని ప్రశ్నించాడు చలమయ్య

"లేదు .... బాబూ! ...." అని నెమ్మదిగా ముఖం దించుకున్నాడు రంగడు

"ఫరవాలేదు. ఆఁ! ... నీతోబాటు "

" ..... మా అక్కయ్య కూడా వచ్చింది బాబూ! .... మీతో మాట్లాడాలిట!" అని ఆమె వేపు తిరిగి "అక్కయ్యా!—ఈయనే నే చెప్పిన చలమయ్యబాబు .." అన్నాడు. ఆమె చలమయ్య కేసి ఒకసారి చూసి, నమస్కరించి, ముఖం దించుకుంది ఆమె వినయనంస్కారాలు, చలమయ్యను లజ్జాపూరితసంశయాలకు గురి చేశాయి

"రండి, కూర్చోండి" అన్నాడు చలమయ్య తడబడుతూ.

ఆమె కూర్చోకుండానే స్తంభం చాటున నిలుచుంది

"ఏమిటమ్మాయ్ విషయం ?" అని ప్రశ్నించాడు చలమయ్య.

"మరేం లేదు ...." అనే ఆమె జవాబు విని, మిత్రు లిద్దరూ సంశయంతో ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. కాని, అంతలో ఆమె మళ్లీ ఇలా అంది : "మీ దగ్గరనుండి వచ్చేశాక, మా తమ్ముడికి మరెక్కడా నౌకరీ దొరకలేదు ... ఎంతో శ్రమ పడుతున్నాం . ."

"నేను కొంత డబ్బు యిచ్చాను గదా! వాడికి

నౌకరీ దొరికే వరకూ—దాన్ని ఉంచుకుని కాలం వెళ్ళనీయకూడదూ ?" అన్నాడు చలమయ్య

"మీరు ఇచ్చిన డబ్బు—మా పొట్టలు నింపుకోడానికే నన్న తలపు—మా కింతవరకూ లేదు !"

"అంటే ?"

"మీరు మరో చోట, చెమటోడ్చి; చేతులు కట్టుకు పనిచేస్తున్నప్పుడు—ఏ చీకూ చింతా లేకుండా—మీ రిచ్చిన డబ్బును ఖర్చుచేసి, మేము సుఖపడాలనే కోరిక మా మనస్సులకు నచ్చలేదు. ఇదిగో .. మీ రిచ్చిన డబ్బు ... " అంటూ కొంగునుండి, మడచిన రెండు వందల రూపాయల కాగితాలను అతని కందివ్వబోయింది

ఆమె ముఖంలోని రేఖలరంగులను, ఇప్పుడు స్పష్టంగా చూడగలిగాడు చలమయ్య. కాని, అదే సమయంలో—ఆ డబ్బుకేసి విచిత్రంగా చూసి చిరునవ్వు నవ్వుకున్నాడు కూడా !—"ఈ డబ్బును రంగడికి నేను ఊరికే యివ్వలేదు. నావద్ద నౌకరీ చేసినందుకు, గౌరవంగా—నమ్మకంతో బ్రతికినందుకు ప్రతిఫలంగా, బహుమానంగా యిచ్చాను. దాన్ని మళ్ళీ నాకు తిరిగి యిచ్చేయడంలో, మీ భావాలు నాకు అర్థం గావడంలేదు ?" అన్నాడు.

"ఈ డబ్బును, మేం ఉంచుకుని మాత్రం చేయగలిగిం దేముంది చెప్పండి ? దాన్ని ప్రయోజనకరంగా ఉపయోగించుకోగల జ్ఞానం, మా తమ్ముడికి లేదాయె ! అందుకని, ఈ డబ్బు అదుకోవడంలో—మీకూ మంచిదారి ఏర్పడగలిగితే మే మెంతో ఆనందిస్తాం మే మిద్దరం పేదలంగానే పుట్టాం, పేదలంగానే పెరుగుతున్నాం. మీ ఆదరణ వల్ల—నాకుగాని, నా తమ్ముడికి గాని, మరో మంచి దారి ఏర్పడగల సూచనలు ఏర్పడగలిగితే . "

"ఏమిటా మంచిదారి ?" అంటూ మధ్యలో అడ్డు ప్రశ్న వేశాడు చలమయ్య.

"గోదారి !" అంటూ చలమయ్యను ఎక్కబొడిచాడు భద్రయ్య. "అర్థంచేసుకోలే వేమిటయ్యా !—పెళ్ళి కెదిగిన అమ్మాయి జీవితానికి మంచిదారి ఏముంటుంది, పెళ్ళి తప్పితే ?"

"ఓ తప్పటడుగులు వేశావన్నమాట" అనబోయాడు చలమయ్య.

"అమ్మాయ్ !—భగవంతు డెవ్వుడూ—మనిషిని ఏకాకిగా పుట్టించడంలేదు ! తోబుట్టువులు లేకపోయినా, అనుబంధాలు లేకపోయినా—మానవులకు—ఒకర్ని ఒకరు అర్థం చేసుకోగల విలువైన హృదయాల నిచ్చాడు దేవుడు ఆ మంచి హృదయం ఉన్న ఎవరూ—ఎదుటివారిని ఏకాకిగా చూడరు. నువ్వా ఏకాకిగా పొరబడడం అంత మంచిది గాదు నీకు నేను తోబుట్టువులాంటివాడ్ని ... ఏవిధమైన సంశయం లేకుండా—నీ మనస్సులోని మాటను నావద్ద చెప్పు తల్లీ !" అన్నాడు భద్రయ్య—పిల్లల తండ్రి

చలమయ్యవేపు చూసి ఇలా అంది ఆమె .

"బాబూ !—మీ రిచ్చిన డబ్బు మా కెలాగూ ప్రయోజన పడదని మేము తెలుసుకున్నాం కాబట్టి మీ దగ్గర వప్పగిస్తున్నాం ఆ డబ్బుతోపాటు మరో కొంత డబ్బును పొందికచేసి, చిన్న కొట్టు ఏర్పాటు చేసే ప్రయత్నం చేయండి ! ఆ కొట్టులో మా తమ్ముడికి చిన్న 'ఉద్యోగం' యిప్పించండి. అందులో వచ్చే కొద్దిపాటి జీతంరాళ్ళతో మా పొట్టను నింపుకొంటాం, మా జీవితం అంత మాత్రం సాగితే, చాలు !—అదే మా కోరిక !.. "

ఆమె మాటలు విని, నిశ్చేష్టు డయ్యాడు చలమయ్య . ఆమె తన ముందుంచిన డబ్బును చూస్తూ—ఆలోచనలో పడిపోయాడు

జీవిత పురోభివృద్ధికై ఆమె చూపిన మార్గదర్శం ఎంత ఉత్కృష్టమైనదీ అర్థం చేసుకుని ఆనందంగా నవ్వుకున్నాడు భద్రయ్య.

"ఆలోచించండి !—వెళ్ళొస్తాను . ." అని, వీధి వేపుకు నడిచిం దామె.

ఆమెను వెంబడించిన రంగడిని, కేకవేసి పిలిచాడు భద్రయ్య

"మీ అక్కయ్య పేరు చెప్పావుగాదు ?"—బుజ్జగింపుగా అడిగాడు

"చిట్టి—చిట్టెమ్మ ! .... " అని నవ్వుతూ జవాబిచ్చి, ఆమెను వెంబడించి కను మరుగై పోయాడు రంగడు.

"చలమయ్యా !—ఏమిటాలోచిస్తున్నావ్?" అని ప్రశ్నించాడు భద్రయ్య.

"భద్రయ్యా !—ఆమె యిచ్చిన సలహాను గురించి నీ అభిప్రాయ మేమిటి ?" అని అడిగాడు చలమయ్య

"ఇలాంటి సలహాలు యివ్వగల ఆడవాళ్ళు లోకంలో పుట్టడం అరుదు వాళ్ళే వెనకటికి మంత్రి స్థానాల కెక్కుతా రనుకుంటా ... అయితే చిట్టి విషయం వేరు !"

"అంటే ?"

"ఇప్పటికి ఏకాకి గదా—"

"అందుకే, నే నొక్క నిశ్చయానికి వచ్చాను నాదగ్గర మూడొందల రూపాయ లున్నాయి రంగడిడబ్బు రెండు వందలూ కలిపి— పెద్దగా కొట్టు పెట్టుకొనే ఏర్పాటు చేసి, ఇద్దరం భాగస్వాములు కాబోతున్నాం "

"అంతేనా ? . మరేం విశేషవిశేషణం లేదూ ?"

"ఉంది .. . అయితే, ఆ విశేషణ మేదో నే నిప్పుడు చెప్పదలుచుకోలేదు . "

"చాల్లే, బిగువు !—నాకూ తెలుసులేవోయ్ !" అని బిగ్గరగా నవ్వేశాడు, భద్రయ్య.

* * *

తన చెల్లెలి కుమారుడి పుట్టినరోజు పండగ ఆనందాన్ని అనుభవించాలన్న ఆశయం చలమయ్యకున్నా, ఉద్యోగ ధర్మం అతన్ని అక్కడికి పెందరాళే వెళ్ళనీయకుండా చేసింది ఆరోజు రాత్రి ఎనిమిది గంటల ప్రాంతానికి తన చెల్లెల్లింటి చేరాడతడు. అతని రాకకోసం ఎదురుచూస్తున్న సుశీల అల్హానందంతో అతన్ని ఆహ్వానించింది. చెల్లెలి కొడుకును చేతులకు తీసుకుని, హృదయపూర్వకంగా ఆశీర్వదించాడు చలమయ్య అంతా చూస్తూ, నారాయణ నిస్తబ్ధతగా ఉండిపోయాడు

చెల్లెలి బలవంతంమీద భోజనానికి అక్కడే కూర్చున్నాడు చలమయ్య అతనికి వడ్డిస్తూ, సుశీల కళ్ళనీళ్ళు పెట్టుకోవడం గుర్తించాడు తను

"ఉన్న కొట్టును అమ్మి, నా సుఖం కోసం ఎంత త్యాగం చేశావు, అన్నయ్యా ! కాని, ఇప్పటికీ—ఇంకొకరికి చేతులు కట్టుకుని నౌకరీ చేయగలుగుతున్నావు . ఎంత దురదృష్టం !—అంతా నావల్లనే గదూ !" అని కుమిలిపోయింది సుశీల

"సుశీలా ! జీవితమంటే, ఎంత విలువైన వస్తువో, నాకు తెలుసు కాబట్టే అలా చేయవలసివచ్చింది ఎవరికోసం— ? నా ఒక్కగా నొక్క చెల్లెలి కోసం—తల్లిని పోగొట్టుకున్న పిల్ల కోసం —నీ కోసం ! నీ సుఖం కంటే, నా క్కావలసిం దేముంది చెప్పు !—ఏకాకిగా ఉన్న నేను ఎలా బ్రతికినా సరిపోతుంది !" అన్నాడు చలమయ్య.

"ఇకమీదట అదేం వీలుగాదు, బావగారూ ! .." అంటూ రంగంలోకి జొరబడ్డాడు నారాయణ.

"ఏమిటి ?"

"మా సుఖం కోసం మీరెంత త్యాగం చేశారో ఆ కృతజ్ఞతతోనైనా—మిమ్మల్ని సుఖపెట్టడానికి మేము మరో నిశ్చయానికి వచ్చాం .. "

"అబ్బో! పెద్ద ఆలోచనలే మరి ! మీ నిశ్చయం ఏమిటో ?"

"మీకు పెళ్ళి జరిపించడం!" అని నవ్వాడు నారాయణ

"పెళ్ళి ?! ... " అని ఆశ్చర్యార్థంతో బిక్కమొగం వేసి, నవ్వేశాడు , చలమయ్య .... "ఆ విషయంగురించి, నాకే అవసరం కలగనప్పుడు ?"

"మీ అవసరావసరాలు మాకు తెలియదేమిటి ? మీ పొరుగింటి మిత్రుడు—భద్రయ్య అన్ని విషయాలు చెప్పాడులెండి !" అన్నాడు నారాయణ.

"కాబోయే వదిన పేరు నాకు తెలుసు .... చిట్టి! చిట్టెమ్మ.... " అని నవ్వింది సుశీల. "పై నెలలో మీకు ముహూర్తం పెట్టించా లనుకుంటున్నాం .... పెళ్ళి పెద్దలం మేమే, మరినూ !"

"మీ రనుకున్నంత దగ్గర్లో ముహూర్తం పెట్టించడం నా కిష్టంలేదు .. డబ్బూ, వసతీ వగైరాలు చూడాలి గదా ?" అన్నాడు చలమయ్య.

"ఆ విచారం మీ కక్కర్లేదు" అన్నాడు నారాయణ

"ఏమిటయ్యా, నీ సొద !" అని పరిహాసంగా నారాయణను మందలించాడు చలమయ్య.

"ఓహో !—అసలు విషయం మీకు తెలియదేమిటి, బావగారూ !—నా జేబుకొట్టేసిన దొంగ—పోలీసులకి పట్టుబడిపోయాడు! డబ్బులో రెండొందలు హరించిపోయినా, వెయ్యి రూపాయలు చేజిక్కిందట .. కోర్టులో తీర్పు కాగానే, అవి నాచేతికి రాదూ ? అవే, మీ పెళ్ళికి ఖర్చులు ...." అన్నాడు నారాయణ—నవ్వుతూ.

"నిజంగా ! .... " అని ఆశ్చర్యపోయాడు చలమయ్య. ★

---

"నేనీ మధ్య 'వైట్ హౌస్'కి వెడదామని బయలుదేరాను. దారిలో ఒక తమాషా జరిగింది" అని శ్రీ అడ్లాయ్‌స్టీవెన్సన్ ఒక ఉపన్యాసం ప్రారంభించాడట.

ఎల్. ఎస్. (మద్రాసు)

---